సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 14 । ఆగస్టు । 2024



రావమ్మా.. మహాలక్ష్మి

ఈ నెల 14 నుంచి 19 వరకు వరుస సెలవులు రానున్నాయి. ఉమ్మడి జిల్లాలోని డిపోల నుంచి ప్రధాన రూట్లలో ఆర్టీసీ అదనపు బస్సులు నడపనుంది. 8లో▸

'కల్యాణలక్ష్మి' కాజేసింద్రు..



ఆ ఆడపడుచులకు అప్పటికింకా వివాహం కాలేదు.. అయినా సర్కారు అందజేసే కల్యాణలక్ష్మి కానుకను వారి పేరిట కొందరు కాజేశారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

పంద్రాగస్టు అతిథి షబ్బీర్ అలీ

కైలాస్‌నగర్: ఆయా జిల్లాల్లో పంద్రాగస్టు వేడుకలకు హాజరుకానున్న అతిథులను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. శుక్రవారం ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న వేడుకలకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని డైస్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన చిన్నపిల్లల ఉచిత గుండె పరీక్ష వైద్య శిబిరానికి స్పందన లభించింది. హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ నేతృత్వంలో నిర్వహించిన శిబిరానికి జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి గుండె సంబంధిత సమస్యలతో కూడిన చిన్నారులను తీసుకువచ్చారు. పిడియాట్రిక్ కార్డియాలజిస్ట్ సుదీప్‌వర్మ పిల్లలను పరీక్షించారు. పలువురిని కిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి వెయ్యి మందిలో 8 నుంచి 10మంది చిన్నారులు గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఇందులో రిమ్స్ ఆర్ఎంవో చందు, డైస్ కేంద్రం ఇన్‌చార్జి మేనేజర్ రాధిక, ఫిజియోథెరపిస్టు నాగర్జున్, అడియోలజిస్ట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని వినతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని పీఆర్టీయూ టీఎస్ సంఘం నాయకులు కోరారు. అదనపు కలెక్టర్ శ్యామలదేవితో పాటు డీఈవో ప్రణీతకు మంగళవారం వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాక్రే బాలచంద్ర, కుడాల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గుర్తించి ఆయా స్థానాల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. ఇటీవల బదిలీ పొందిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. ఇందులో ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షుడు ఆరే భాస్కర్, ఆదిలాబాద్ అర్బన్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ బోయర్ తదితరులున్నారు.

మూడు డిగ్రీ కళాశాలలకు ప్రిన్సిపాళ్ల నియామకం



ప్రిన్సిపాల్ అతిక్ బేగంకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు ఎఫ్ఏసీ ప్రిన్సిపాళ్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలకు డాక్టర్ అతిక్ బేగం, ఆదిలాబాద్ సైన్స్ డిగ్రీ కళాశాలకు సంగీత, ఉట్నూర్ డిగ్రీ కళాశాలకు టి.ప్రతాప్‌సింగ్‌ను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. అతిక్ బేగం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు కళాశాల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



రిమ్స్‌లోని చిల్డ్రన్ వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు

డెంగీ బెల్స్

- జిల్లాలో ఈ ఏడాది 49 కేసులు నమోదు
- విజృంభిస్తున్న విషజ్వరాలు
- సీజనల్ వ్యాధులతో జనం అతలాకుతలం
- రోగులతో కిక్కిరిసిన రిమ్స్ ఆస్పత్రి

జిల్లాలో మూడేళ్లుగా నమోదవుతున్న డెంగీ కేసులు

సంవత్సరం	నమోదైన డెంగీ కేసులు
2022	207
2023	108
2024 (ఆగస్టు వరకు)	49

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో 'డెంగీ' డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. పక్షం రోజుల్లోనే అధికారిక లెక్కల ప్రకారం 14 కేసులు నమోదు కాగా, అనధికారికంగా రెండు, మూడురెట్లు అధికంగానే ఉంటాయని తెలుస్తోంది. చిన్నాపెద్ద అనేతేడా లేకుండా జనం విషజ్వరాల బారిన పడుతున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల్లోనూ జనం మంచాన పడుతున్నారు. జిల్లాలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులతో పాటు రిమ్స్ రోగులతో కిక్కిరిసిపోయి కనిపిస్తున్నాయి.

ప్రబలుతున్న విషజ్వరాలు..

జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు 8వేల మంది జ్వరాల బారిన పడ్డారు. దగ్గు, జలుబు, జ్వరంతో వస్తుండగా డయేరియా,డెంగీకేసులు నమోదవుతున్నాయి. మరోవైపు ఏజెన్సీప్రాంతంలో వైద్యారోగ్య శాఖాధికారులు ఫీవర్ సర్వే చేపడుతున్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచిస్తున్నారు. వైద్యశిబిరాల ఏర్పాటుతోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా కేసులుపెరుగుతుండడం గమనార్హం.

దోచుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రులు..

డెంగీ పేరిట కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు రోగులను నిలువుదోపిడీకి గురి చేస్తున్నాయి. రిమ్స్ మినహా మరే చోట డెంగీ నిర్ధారణ పరీక్ష కేంద్రాలు లేవు. అయినప్పటికీ పలు ప్రైవేట్ ఆస్పత్రులు ర్యాపిడ్ ద్వారా డెంగీనిర్ధారణ పరీక్షలు చేసి రోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్లేట్‌లేట్స్ పడిపోతున్నాయని, ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకొని రోజుకు వేలాది రూపాయలు దండుకుంటున్నారు. నిబంధనల ప్రకారం జ్వరపీడితులకు డెంగీ వచ్చినట్లు అనుమానం ఉంటే రిమ్స్‌కు శ్యాంపిల్స్ పంపించాలి. అయితే ప్రైవేట్ యాజమాన్యాలు ఇవేమి పట్టించుకోకుండా ధనార్జనే లక్ష్యంగా వారి వద్దే పరీక్షలు చేపడుతున్నారు. డెంగీ అని నిర్ధారణ చేస్తుండడంతో కొంతమంది మహారాష్ట్రలోని యవత్మాల్, నాగ్‌పూర్, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు.

49 డెంగీ కేసులు నమోదు..

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 49 డెంగీ కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా అంకోలి పీహెచ్‌సీ పరిధిలో 9నమోదుకాగా, జిల్లాకేంద్రంలోని చిల్కూరిలక్ష్మినగర్‌లో 3, గుడిహత్నూర్‌లో 2 కేసులు నమోదయ్యాయి. పక్షం రోజుల్లోనే అధికారికంగా 14 కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. చాలామంది ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ చికిత్స పొందుతున్నారు. దాదాపు 50 కేసుల వరకు ఉండవచ్చని తెలుస్తోంది.

కిక్కిరిసిన ఆస్పత్రులు..



కిక్కిరిసిన రిమ్స్‌లోని ఓపీ విభాగం

జిల్లాలో విషజ్వరాలు, డెంగీ ప్రబలుతుండడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో బెడ్లు ఫుల్ అవుతున్నాయి. రిమ్స్‌లో చిన్న పిల్లల వార్డు కిక్కిరిసి కనిపిస్తోంది. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో జలుబు, దగ్గు, జ్వరంతో ప్రజలు బాధపడుతున్నారు. దీంతోపాటు రిమ్స్‌లోని ఓపీ విభాగంలో సైతం రోగుల సంఖ్య పెరుగుతోంది. మహిళ వార్డులోనైతే ఒక్కో బెడ్‌పై ఇద్దరేసి రోగులకు చికిత్స అందిస్తున్నారు. మరికొంత మంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వ్యాధుల సీజన్ కావడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలి. వ్యాధుల నివారణ కోసం ఆయా పీహెచ్‌సీల పరిధిలో చర్యలు చేపడుతున్నాం. ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

గ్రామసింహాలు @ 9,107



- ప్రత్యేక సర్వేలో తేలిన కుక్కల లెక్క
- ప్రభుత్వానికి పంచాయతీశాఖ నివేదిక
- గుబులు పుట్టిస్తున్న గణాంకాలు

కైలాస్‌నగర్: పల్లెల్లో సంచరించే గ్రామ సింహాల లెక్క తేలింది. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శునకాల లెక్క తేల్చాలని యంత్రాంగాన్ని ఆదేశించింది. ఇందుకోసం ఈ నెల 8న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ప్రత్యేక సర్వే చేపట్టారు. జిల్లాలోని 468 గ్రామ పంచాయతీల్లో 9,107 శునకాలు ఉన్నట్లుగా గుర్తించిన పంచాయతీ కార్యదర్శులు వాటి వివరాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. జిల్లా పంచాయతీ అధికారులు ఈ జాబితాను ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఈ గణాంకాలు మాత్రం జిల్లావాసుల్లో గుబులు పుట్టిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

పల్లె, పట్టణమనే తేడా లేకుండా ఇటీవల జిల్లాలో కుక్కల బెడద అధికమైంది. వాటిని నియంత్రించే దిశగా పట్టణాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టినప్పటికీ పంచాయతీల్లో మాత్రం ఆ దిశగా చర్యలు కరువయ్యాయి. దీంతో ఇటీవల శునకాల స్వైర విహారం పెరిగింది. వాటి కట్టడి దిశగా పంచాయతీలు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒంటరిగా కనిపిస్తే చాలు తీవ్రంగా గాయపరుస్తున్నాయి. గుంపులుగా తిరుగుతున్న శునకాలతో పల్లె వాసుల్లో భయాందోళన వ్యక్తమవుతుంది. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు ఒంటరిగా బయటకు రావాలంటే జంకుతున్నారు.

ఎలా కట్టడిచేస్తారో ...

గ్రామ శునకాలతో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం వాటిని గుర్తించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 5 నుంచి 9వరకు నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 8వ తేదీన వీటి గుర్తింపు కోసం ప్రత్యేక సర్వే చేపట్టాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో ఉన్న కుక్కల లెక్క తేల్చారు. జిల్లా వ్యాప్తంగా 17 మండలాల పరిధిలోని 468 గ్రామ పంచాయతీల్లో 9,107 కుక్కలు ఉన్నట్లుగా నిర్ధారించారు. అయితే ఈ సర్వే ఒకటి రెండు మండలాలు మినహా మిగతా చోట్ల నామమాత్రంగా చేసి లెక్కలు సమర్పించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు జిల్లావ్యాప్తంగా వేలాదిగా ఉన్న ఈ కక్కలను జిల్లా పంచాయతీ యంత్రాంగం ఏ విధంగా కట్టడి చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

మండలం	గ్రామ పంచాయతీలు	కుక్కలు
ఆదిలాబాద్‌రూరల్	34	404
బజార్‌హత్నూర్	30	182
బేల	37	751
భీంపూర్	26	227
భోథ్	33	739
గుడిహత్నూర్	26	356
ఇచ్చోడ	32	201
జైనథ్	42	1,022
మావల	03	47
నేరడిగొండ	32	477
సిరికొండ	19	208
తలమడుగు	28	1,532
తాంసి	13	102
గాదిగూడ	25	169
ఇంద్రవెల్లి	28	1,147
నార్నూర్	23	725
ఉట్నూర్	37	818

ప్రభుత్వానికి నివేదించాం



గ్రామాల్లో సంచరిస్తున్న కుక్కలను గుర్తించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 8న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించాం. 17 మండలాల పరిధిలో తిరుగుతున్న కుక్కలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

– ఎస్.శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి

గోడౌన్‌కు ఈవీఎంల తరలింపు

- ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

కైలాస్‌నగర్: ఇటీవల ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో వినియోగించిన ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను తిరిగి జిల్లా కేంద్రంలోని గోడౌన్‌కు తరలించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసి 45 రోజులు పూర్తయింది. అయితే ఈ ఎన్నికపై రాజకీయంగా ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. దీంతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా మంగళవారం వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కేంద్రంలోని టీటీడీసీని సందర్శించారు. అక్కడి స్ట్రాంగ్ రూం తాళాలు తెరిపించారు. అందులో భద్రపరిచిన ఆయా నియోజకవర్గాల ఈవీఎంలను పరిశీలించారు. వారి సమక్షంలోనే వాటిని పట్టణంలోని శాంతినగర్‌లో గలగోడౌన్‌కు తరలించి అక్కడ భద్రపరిచారు. అనంతరం స్థానిక టీటీడీసీలో ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులకు స్కూల్ యూనిఫాంపై నిర్వహిస్తున్న బల్క్‌కటింగ్ శిక్షణను ఆయన పరిశీలించారు. వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్‌రూం తాళం తీయిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

తంతోలిలో పర్యటించిన కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని తంతోలి గ్రామాన్ని కలెక్టర్ రాజర్షి షా మంగళవారం సందర్శించారు. పారిశుద్య నిర్వహణ తీరును పరిశీలించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల,అంగన్‌వాడీకేంద్రం, రేషన్‌షాపును తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని నిర్వాహకులకు సూచించారు.అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం రుచి చూ శారు. ఇంటింటి ఫీవర్ సర్వే వివరాలను ఏఎన్ఎం, ఆశా వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి నాగభూషణం, తహసీల్దార్ సాయి మహేశ్, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఎంపీవో ఆనంద్, తదితరులున్నారు.

పాతుకుపోయారు..!

- పలు శాఖల్లో దీర్ఘకాలంగా ఒకే చోట విధులు
- బదిలీల్లోనూ కలగని స్థానచలనం
- ఫోకల్ పోస్టుల్లో కొనసాగుతూ..
- ఆదాయంపై దృష్టి సారిస్తూ..
- పలు జిల్లా కార్యాలయాల్లో ఇదే పరిస్థితి

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలోని పలు శాఖల్లో కొంత మంది అధికారులు దీర్ఘకాలంగా ఒకే చోట పాతుకుపోయారు. ఇటీవల జరిగిన బదిలీల్లోనూ స్థానచలనం కలగకుండా అప్రమత్తమయ్యారు. అన్ని విధాలా అనుకూలంగా ఉన్న పోస్టును వీడకుండా తమకున్న పలుకుబడితో చక్రం తిప్పారనే ఆరోపణలున్నాయి. మరికొందరు బదిలీ అయినా డిప్యూటేషన్ పేరిట మళ్లీ పాతచోటుకే చేరుతుండడం అనుమానాలకు తావిస్తోంది.

మచ్చుకు కొన్ని..

- జిల్లా యువజన, క్రీడల శాఖలో ఉన్నతాధికారి దశాబ్దాలుగా ఇక్కడే కొనసాగుతున్నారు. ఇదే శాఖలో పనిచేసే ఆయన సతీమణి కూడా ఏళ్లుగా ఇక్కడే ఉన్నారు.
- జిల్లా ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో హోదా లేకపోయినప్పటికీ ఓ సాధారణ ఉద్యోగిని ఉన్నత పోస్టులో కొనసాగుతున్నారు. అంతేకాకుండా తన మాతృశాఖ విధుల్లోనూ జోక్యం చేసుకుంటున్నారనే అపవాదు కూడా ఉంది.
- మున్సిపాలిటీలో ఓ ఇంజినీరింగ్ అధికారి ఏళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నప్పటికీ ఇటీవల బదిలీల్లో ఆయన పేరు లేకపోవడం గమనార్హం.
- జిల్లా కేంద్రంలోని కోశాధికారి కార్యాలయం (డీటీవో)లో ఓ అధికారి ఏళ్లగా పాతుకుపోయాడు. ప్రాధాన్యత పోస్టులో కొనసాగుతున్న ఆయనకు మొన్నటి బదిలీల్లోనూ స్థానచలనం కలగలేదు. ఇలా అనేక మంది అధికారులు ఫోకల్ పోస్టుల్లో కొనసాగుతూ అదనపు ఆదాయం కోసం సీటు వీడడం లేదనే విమర్శలున్నాయి.

ఇదేనా ప్రభుత్వ ఉద్దేశం..

సాధారణంగా ప్రతీ క్యాడర్‌లో ప్రతి ఉద్యోగి శాఖలోని వివిధ సెక్షన్లలో అనుభవం గడించడం ద్వారా పరిపాలన వ్యవహారాల్లో పటిష్టత సాధించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అందుకోసం బదిలీల్లో సెక్షన్లలో అధికారులను మార్చడం, ఫోకల్ పోస్టులో కొనసాగుతున్న వారిని నాన్‌ఫోకల్‌కు పంపించడం, అలాగే అటు నుంచి ఇటు తీసుకురావడం జరుగుతుంది. దీని వెనుక ప్రభుత్వానికి మరో ఉద్దేశం కూడా దాగి ఉంది. ప్రధానంగా ఒక అధికారి దీర్ఘకాలంగా ఒకే పోస్టులో కొనసాగితే అక్కడ అవినీతి రాజ్యమేలుతుందనేది సర్కారు భావన. ఈ నేపథ్యంలోనే మార్పులు చేర్పులు చేయడం ద్వారా ఎంతో కొంత అవినీతిని అరికట్టాలన్నది ఉద్దేశం. అంతేకాకుండా అన్ని ప్రభుత్వ శాఖల్లో ప్రతి క్యాడర్‌లో సీనియారిటీని ఫిక్సప్ చేయడం జరుగుతుంది. తద్వారా జూనియర్లు పదోన్నతి పొంది కీలక సెక్షన్లు నిర్వహించే విధంగా ఎదగాలి. దాంట్లో సీనియర్ అధికారులు ముందు నుంచి తోడ్పాటునందించాలి. అయితే ఇప్పుడు సీనియర్ల నుంచి ఆ సహకారం మచ్చుకు కూడా కనిపించదన్న అభిప్రాయం ప్రతిశాఖలో ఉంది. ప్రాధాన్యత సెక్షన్‌ను సీనియర్ అధికారి తన గుప్పిట్లో ఉంచుకోవాలనుకోవడం, జూనియర్ అధికారికి విధుల నిర్వహణలో సహకరించకపోవడం ద్వారా అనుభవం గడించకుండా ఎత్తులు వేస్తున్నారన్న అభిప్రాయం లేకపోలేదు. జెడ్పీలో ఒక అధికారిని డిప్యూటేషన్‌పై మండలం నుంచి తీసుకొనివచ్చి కీలక పోస్టులో కొనసాగించడమే ఇందుకు నిదర్శనం. ఇలాంటి విషయాల్లో జిల్లా ఉన్నతాధికారి సూక్ష్మంగా దృష్టి సారించాలనే అభిప్రాయం ఉద్యోగుల్లో ఉంది. తద్వారా అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి సమన్యాయం దక్కుతుందన్న భావన వారిలో ఉంది.

సీటు వీడట్లేదు..

ఆయా శాఖల్లో బదిలీలపై ప్రభుత్వం బ్యాన్ విధించిన తర్వాత మళ్లీ అక్రమ డిప్యూటేషన్లు మొదలయ్యాయని 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. 'బదిలీలు అభాసుపాలు..' శీర్షికన ప్రచురితమైన కథనం సంచలనం కలిగించింది. ఇదే కోణంలో పలు శాఖల్లో కొంత మంది అధికారులు ఏళ్లుగా తిష్టవేసి కూర్చున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బదిలీలు కూడా వారిని జరపలేక పోయాయి. అలాగని వారేదో ఇటీవలే ఆ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు అనుకుంటే పొరపాటు. దీర్ఘకాలంగా ఒకే చోట ఫోకల్ పోస్టులో కొనసాగుతూ వస్తున్నారు. ఆర్టీఏ కార్యాలయంలో ఓ సీనియర్ అసిస్టెంట్ ఏళ్లుగా కొనసాగుతున్నారు. ఒక ఉన్నతాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో కొద్ది నెలల క్రితం వరకు ఆయన ఆ స్థానంలో ఇన్‌చార్జిగా కూడా కొనసాగారు. రెగ్యులర్ అధికారి రావడంతో మళ్లీ తన పోస్టులోకి వెళ్లారు. విద్యాశాఖలో ప్రణాళిక విభాగంలో ఓ అధికారి చాలా ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఆ శాఖలో పాతుకుపోయారు. వ్యవసాయ శాఖలో అనేక మంది అధికారులు ఏళ్లుగా అనే బదులు దశాబ్దాలుగా జిల్లా కేంద్రంలోనే ఉన్నారు. వారి సర్వీస్ మొత్తం ఇక్కడే కొనసాగుతుందని అనడంలోనూ అతిశయోక్తి లేదు. రెవెన్యూ శాఖలోనూ కీలక విభాగాల్లో పలువురు అధికారులు పాతుకుపోయి ఉన్నారు. ఈ బదిలీల్లోనూ వారికి స్థానచలనం కలగలేదు. జలవనరుల శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో శాఖలోని ఒక సెక్షన్ నుంచి ఇంకో సెక్షన్‌కు అధికారుల బదిలీలు జరిగాయి. ఒక విధంగా చెప్పాలంటే కార్యాలయంలోని అదే భవనంలో వారి చాంబర్లు మారాయి కానీ.. జిల్లా కేంద్రాన్ని విడిచిపెట్టి పోయిందిలేదు. జెడ్పీలో ఒక అధికారి సీనియర్ అసిస్టెంట్‌గా ఆ తర్వాత పదోన్నతి పొంది సూపరింటెండెంట్‌గా జిల్లా కేంద్రంలోనే కొనసాగుతున్నారు.

ఆదిలాబాద్ బంద్ సంపూర్ణం

కైలాస్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసాత్మక దాడులను వ్యతిరేకిస్తూ హిందూ సంఘాలు చేపట్టిన ఆదిలాబాద్ బంద్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో వ్యాపార, వాణిజ్య సంస్థలను నిర్వాహకులు స్వచ్ఛందంగా మూసివేసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పట్టణంలో నిత్యం రద్దీగా కనిపించే ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. ఏబీవీపీ, హిందూ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్, హిందూసేన, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు పట్టణంలో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు సీఐలు, ఎస్సైలు భద్రతను పర్యవేక్షించారు.



నిర్మానుష్యంగా అంబేడ్కర్‌చౌక్ కూడలి

హిందూ సంఘాల నిరసన ర్యాలీ

కైలాస్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. రామచంద్రా గోపాలకృష్ణ మఠం నుంచి ప్రారంభమైన ప్రదర్శన ప్రధాన వీధుల గుండా అంబేద్కర్‌చౌక్ వరకు సాగింది. ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మఠాధిపతి యోగానంద సరస్వతి, వేదపండితులు, హిందూ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. అక్కడి దాడుల్లో మరణించిన హిందువులకు సంతాపసూచకంగా కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. హిందువులలో ఐక్యత రావాల్సిన అవసరముందన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్

వేతనాలు పెంచాలని వినతి

ఆదిలాబాద్‌టౌన్: ఆరోగ్యశ్రీలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పిస్తూ వేతనాలు పెంచాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6న రాష్ట్రసంఘ బాధ్యులు ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు సమ్మె నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. జీవో నం. 60 ప్రకారం వేతనంరూ.22,740కు పెంచాలని తెలిపారు. ఇందులో సంఘబాధ్యులు అనిత, శ్రీనివాస్, సుజాత, లక్ష్మి, సుమలత, భీంరావు, రమేష్, దత్తాత్రి, విమల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వరలక్ష్మినగర్‌కు చెందిన వృద్ధురాలు బొత్తు గంగమ్మ (70) ఈనెల 10 నుంచి కనిపించకుండా పోయింది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబీకులు ఆమె కోసం గాలించినా ఆచూకీ దొరకలేదు. మంగళవారం ఆమె మనవరాలు వరలక్ష్మి టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా హెడ్‌కానిస్టేబుల్ మదన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలిటికల్ సైన్స్‌లో స్టేట్ సెకండ్ ర్యాంకు


విజయ్‌కుమార్

బోథ్: ఇటీవల విడుదలైన ఉమ్మడి విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షల ఫలితాల్లో ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో పిప్పలధరి గ్రామవాసి మల్యాల విజయ్‌కుమార్ స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించాడు. మండల వాసులు, గ్రామస్తులు అతన్ని అభినందించారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి


షేక్ మక్దూం మృతదేహం

ముధోల్: మండలంలోని చించాల పంచాయతీ అనుబంధ గ్రామమైన పిప్రీకి చెందిన షేక్ మక్దూం(45) విద్యుత్‌షాక్ గురై మంగళవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మక్దూం ఇంట్లో కరెంటు రావడం లేదని ఇంటి పక్కనే ఉన్న పెద్ద కర్రతో స్తంభం వైర్‌కు తగిలించాడు. ఒక్కసారిగా విద్యుత్‌షాక్ గురై కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి, అటు నుంచి భైంసా ఏరియాసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

రావమ్మా.. మహాలక్ష్మి

- ఈనెల 14 నుంచి 19 వరకు స్పెషల్ బస్సులు
- వరుస సెలవుల నేపథ్యంలో..
- ఉమ్మడి జిల్లా డిపోల నుంచి 129 అదనపు సర్వీసులు



మంచిర్యాలఅర్బన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికులకు టీజీఆర్టీసీ శుభవార్త అందించింది. ఆయా డిపోల నుంచి ప్రధాన రూట్లతోపాటు హైదరాబాద్ నుంచి స్పెషల్ సర్వీసులు నడపనుంది. ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవం, 16న వరలక్ష్మీ వ్రతం, 18 ఆదివారం సెలవు, 19న రాఖీ పౌర్ణమి ఇలా వరుస సెలవులు ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామాలకు వెళ్లనున్నారు. ఈనేపథ్యంలో 14 నుంచి 19వ తేదీ వర కు ప్రత్యేక బస్సులు నడపనుంది. ఉమ్మడి జిల్లాలోని డిపోల ద్వారా జేబీఎస్ నుంచి 129 బస్సుల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయనుంది.

మంచిర్యాల డిపో నుంచి..

మంచిర్యాల డిపో నుంచి ప్రధాన రూట్లు లక్సెట్టిపేట, జన్నారం, చెన్నూర్, గోదావరిఖని-కరీంనగర్ వరకు ప్రస్తుత బస్సులకు అదనంగా తిప్పేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 150 బస్సుల్లో రాజధాని-03, ఏసీ లహరి-04, నాన్ ఏసీ లహరీ-04, సూపర్‌లగ్జరీ-24, ఎక్స్‌ప్రెస్-06, పల్లె వెలుగు-39, ప్రైవేట్ ఎక్స్‌ప్రెస్-15, ప్రైవేట్ పల్లెవెలుగు-54 బస్సులున్నాయి. ఇందులో 145 బస్సుల ద్వారా 61 వేల కి.మీ మేర బస్సులు తిప్పుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. 5 బస్సులు ఎప్పుడు స్పేర్‌లో ఉండనున్నాయి. రాఖీ పండుగ వేళ ఒక్క బస్సు కూడా డిపోలో ఉండకుండా రోడ్లపై రయ్‌రయ్‌మంటూ తిరుగనున్నాయి. హైదరాబాద్‌లో ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం వెళ్లిన వారందరూ ఇంటిబాట పట్టనున్నారు. హైదరాబాద్ రెగ్యులర్‌గా 38 బస్సులు నడుపుతున్నారు. రాఖీ, వరుస సెలవుల నేపథ్యంలో మంచిర్యాల డిపో నుంచి ఈనెల 14నుంచి 16వరకు మూడు, 17న 18, 18న 10, 19న 18 బస్సులు తిప్పనున్నారు.

ఆయా డిపోల నుంచి..

ఈనెల 14 నుంచి 19వరకు జేబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. భైంసా, ఉట్నూర్ డిపోలు మినహాయిస్తే రద్దీ నేపథ్యంలో జేబీఎస్ నుంచి ఆదిలాబాద్‌కు ఆదిలాబాద్ డిపో బస్సులు 21, ఆసిఫాబాద్ డిపో బస్సులు 23, మంచిర్యాల డిపో బస్సులు, నిర్మల్ డిపోకు చెందిన 30 బస్సులు మొత్తం 129 ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

మహాలక్ష్మి తర్వాత రాఖీ పండుగతో..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం అమలు చేసింది. దీంతో మహిళల ఉచిత బస్సు ప్రయాణం రెట్టింపయింది. దీనికితోడు రాఖీ పండుగకు రద్దీ ఉండనుండటంతో ఆయా బస్‌స్టేషన్లలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. శ్రావణమాసం ఛాలెంజ్‌లో భాగంగా మహాలక్ష్మి టికెట్లతో సంబంధం లేకుండా మంచిర్యాల డిపోకు రూ.21 లక్షల ఆదాయం టార్గెట్ విధించారు. వరుస సెలవుల నేపథ్యంలో బస్సులు తిప్పడం ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా అధికారులు నిర్ణయించారు.

ప్రత్యేక ఇన్సెంటివ్

మంచిర్యాల డిపోలో రోజుకు 61 వేల కి.మీ మేర బస్సులు రాకపోకలు సాగిస్తుండగా పండుగ నేపథ్యంలో మరో 6 వేల కి.మీ మేర అదనంగా బస్సులు నడపనున్నారు. ఉద్యోగులను ప్రోత్సహించేందుకు అడిషనల్‌గా విధులు నిర్వహించే కండక్టర్లకు కి.మీకి రూ.3 చొప్పున చెల్లించనున్నారు. ఉదాహరణకు అడిషనల్ 60 కి.మీ తిప్పితే రూ.3 చొప్పున 180 రూపేణా విధులు ముగియగానే చెల్లించనున్నారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం

రాఖీ సందర్భంగా ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. డిపో పరిధిలో హైదరాబాద్‌తోపాటు ప్రధాన రూట్లు కరీంనగర్, జన్నారం, ఆసిఫాబాద్, చెన్నూర్ రూట్లలో అదనపు బస్సులు నడపనున్నాం. జేబీఎస్ బస్‌స్టేషన్‌తోపాటు మంచిర్యాల డిపో వద్ద బస్సుల సమాచారం అందించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాం.

– జనార్దన్, డిపో మేనేజర్, మంచిర్యాల

పగిలిన పైపు వాల్వు.. ఎగిసిపడిన నీరు



దిలావర్‌పూర్ మండలంలోని న్యూలోలం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ వాల్వు పగిలింది. రెండు గంటలపాటు నీరు నింగికి ఎగిసిపడింది. మాడేగాం గ్రామంలోని గుట్ట ప్రాంతంలో వాటర్‌గ్రిడ్ ట్రీట్‌ప్లాంట్ నుంచి నిర్మల్, ఆదిలాబాద్ వెళ్లే పైప్‌లైన్ వాల్వు వద్ద పగిలి నీరంతా వాటర్ ఫౌంటేన్‌లా ఎగజిమ్మింది. ఆ రోడ్డుగుండా వెళ్లేవారు, గ్రామస్తులు వీక్షించారు. – దిలావర్‌పూర్

రూ.80లక్షల నిధుల దుర్వినియోగం

- ఆదిలాబాద్ డీసీసీబీ డిప్యూటీ రిజిస్ట్రార్ సస్పెన్షన్

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కె.సింహాచలంపై సస్పెన్షన్ వేటు ప డింది. నిజామాబాద్ జిల్లా సహకారశాఖ అధికా రిగా పనిచేసిన సమయంలో సొసైటీలకు సంబంధించిన నిధులు దుర్వినియోగం చేస్తూ భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. ఆయన అవినీతి బాగోతం బయటకు పొక్కడంతో చర్యల నుంచి తప్పించుకునేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లాకు బదిలీపై వచ్చారు. అయితే ఆయన వ్యవహారంపై ప్రత్యేకాధికారితో విచారణ జరిపించిన ప్రభుత్వం రూ.80లక్షల మేర అక్రమాలకు పాల్పడినట్లుగా నిర్ధారించింది. ఈ మేరకు ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డైరెక్టర్, కమిషనర్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ ఉదయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

మామిడి చెట్లకొమ్మలు కత్తిరించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న సందీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ప్రస్తుతం మామిడి తోటల్లో చెట్ల కొమ్మలు కత్తిరించడంతో పంట దిగుబడి పెరుగుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి సందీప్‌కుమార్ అన్నారు. ఉట్నూర్‌లోని ఐటీడీఏ ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రంలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. చెట్ల కొమ్మలు కత్తిరింపుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిఏటా నిలకడగా కాపు కాస్తుందని, చెట్టుకు గాలి, వెలుతురు బాగా సోకి దిగుబడి పెరుగుతుందన్నారు. ఉద్యన నర్సరీ, శిక్షణ కేంద్రంలో చెట్లకు కత్తిరింపులు స్వయంగా చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన నర్సరీ సాంకేతిక అధికారి కుమారి అర్షిత, ఎన్‌జీవోల ప్రతినిధులు సాక్రుబాయి, తిరుమలేశ్, న్యాను ఉన్నారు.

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్తులు


ముట్టడిస్తున్న కొత్తూరు గ్రామస్తులు

తలమడుగు: మండలంలోని కొత్తూరు గ్రామంలో కరెంట్ సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు మంగళవారం రాత్రి తలమడుగు సబ్‌స్టేషన్‌ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తూరులో దాదాపు 20 ఇళ్లకు వారం రోజులుగా సరఫరా లేకపోవడంతో చిమ్మచీకట్లో ఉండాల్సి వస్తుందన్నారు. ఈ విషయాన్ని అధికారులకు విన్నవిస్తే సరే..రేపు చేద్దామని అంటున్నారే తప్ప పనులు చేపట్టడం లేదన్నారు. ఏఈ, డీఈకి ఫోన్ ఫోన్ చేసినా స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆదిలాబాద్ చేరిన రాజీవ్ జ్యోతియాత్ర


యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కైలాస్‌నగర్: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ ఐటీ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నార్త్ చెన్నై ఈస్ట్ డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్, చెన్నై కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ శ్యామూల్ దిరవైయం సారథ్యంలో చేపట్టిన రాజీవ్‌గాంధీ జ్యోతి యాత్ర మంగళవారం జిల్లా కేంద్రానికి చేరింది. ఈ యాత్ర బృందానికి పార్టీనేతలతో కలిసి కంది ఘన స్వాగతం పలికారు. తన క్యాంపు కార్యాలయానికి వచ్చిన బృంద సభ్యులతో కంది మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభ్యులు ఆయనకు జ్యోతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన రాజీవ్‌గాంధీని స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. కన్యాకుమారి నుంచి ప్రారంభమై ఈ యాత్ర శ్రీపెరంబుదూర్ వరకు చేరుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్, నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

‘కల్యాణలక్ష్మి’ కాజేసిండ్రు..!

- లబోదిబోమంటున్న ఆదివాసీలు
- ఆలస్యంగా వెలుగులోకి
- న్యాయం చేయాలంటూ ఆందోళన
- ఇచ్చోడ మండలంలో ఘటన


కల్యాణలక్ష్మి దరఖాస్తులతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న యువతుల తల్లిదండ్రులు

ఇచ్చోడ: ఆ ఆడపడుచులకు అప్పటికింకా వివాహం కాలేదు.. అయినా సర్కారు అందజేసే కల్యాణలక్ష్మి కానుకను వారి పేరిట కొందరు కాజేశారు.. ఈ ఘటన ఇచ్చోడ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బావోజీపేట్‌కు చెందిన ముగ్గురు ఆదివాసీ యువతులకు ఆరేళ్ల క్రితం పెళ్లి కాకున్నా అయినట్లుగా కొందరు కల్యాణలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేశారు. వారి పేరిట చెక్కులు సైతం పంపిణీ అయినట్లు రెవెన్యూ రికార్డులో నమోదైంది. అయితే ఇందులో ఒక యువతికి మూడేళ్ల క్రితం, మరో ఇద్దరికి ఈ ఏడాది వివాహాలు అయ్యాయి. అర్హులైన వారి తల్లిదండ్రులు కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడుస్తున్నా మంజూరు కావడం లేదు. ఈ క్రమంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. అధికారులను సంప్రదించగా ఆరేళ్ల క్రితమే వారి ఆధార్ కార్డులపై చెక్కులు మంజూరైనట్లు పేర్కొనడంతో అవాక్కయ్యారు. తమకు న్యాయం చేయాలంటూ కార్యాలయం ఎదుట వారు ఆందోళనకు దిగారు.

ఆలస్యంగా వెలుగులోకి..

బావోజీపేట్‌కు చెందిన ఆదివాసీ యువతి మండాడి ఎత్మబాయికి మే 2021లో వివాహమైంది. అలాగే గ్రామానికి చెందిన యువతులు మల్లవ్వకు ఈ ఏడాది ఫిబ్రవరిలో, కుడిమేత పంచబాయికి ఈ ఏడాది మేలో పెళ్లిళ్లు జరిగాయి. వివాహ అనంతరం వారి తల్లిదండ్రులు కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడిచినా చెక్కులు అందడం లేదు. ఈక్రమంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న వారు డిప్యూటీ తహసీల్దార్‌ను సంప్రదించారు. అయితే ఆయన ఆన్‌లైన్‌లో చూడగా..ముగ్గురు యువతులకు సంబంధించిన కల్యాణలక్ష్మి చెక్కులు 2018-19లోనే మంజూరై పంపిణీ చేసినట్లు రికార్డుల్లో నమోదై విషయాన్ని వెల్లడించారు. వారి వయస్సులను మార్చిడి చేసి ఈ అక్రమానికి పాల్పడినట్లు గుర్తించారు. తమకు న్యాయం చేయాలంటూ దరఖాస్తుదారులు ఆందోళనకు దిగారు. కాగా, 2018లో మండలంలో కల్యాణలక్ష్మి పథకంలో భారీ అవినీతి జరిగినట్లు వెలుగులోకి రాగా నాడు కేసులు కూడా నమోదవడం గమనార్హం.

గిరి గ్రామాల్లో శివబోడి పూజలు


గట్టెపల్లి శివారులో పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: శ్రావణమాసం పురస్కరించుకొని మండలంలోని గిరి గ్రామాల్లో ఆదివాసీలు మంగళవారం శివబోడి పూజలు నిర్వహించారు. గట్టెపల్లి, టికిడిగూడ, కొలాంగూడ, చిత్తగూడ, హనుమన్‌గూడ గ్రామాల శివారులో దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణంలో దేవతలకు పూజలు చేస్తే గ్రామాలకు ఎలాంటి కీడు రాదని, ప్రజలు, మూగజీవులు ఆయురారోగ్యంతో ఉంటారని ఆదివాసీల నమ్మకం. డొంగురావ్, గోవింద్, రాంషావ్ తదితరులు ఉన్నారు.


వాగు దాటుతున్న వైద్య సిబ్బంది


ధన్నుగూడలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

వాగు దాటి వైద్యం

నార్నూర్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగాయి. మంగళవారం నార్నూర్ పీహెచ్‌సీ హెచ్‌ఈవో రాథోడ్ తులసీదాస్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, సిబ్బంది మండలంలోని బాబేఝరి పంచాయతీ పరిధిలోని ధన్నుగూడ వెళ్లేందుకు వాగు దాటారు. 3 కి.మీ కాలినడకన వెళ్లి గ్రామానికి చేరుకుని వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణులతోపాటు ఇంటింటికి వెళ్లి వైద్యపరీక్షలు చేసి రక్త నమూనాలు సేకరించారు. నిల్వ ఉన్న వర్షపు నీటిని పారబోశారు. ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు, ఏఎన్‌ఎం మాన్కుబాయి, ఈశ్వరి, అంగన్‌వాడీ టీచర్ మల్లు, చంపాబాయి, ఆశ కార్యకర్తలు రూపాబాయి, ఎత్మాబాయి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

గంజాయి నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: గతేడాది నవంబర్‌లో ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో 37 కిలోల గంజాయిని టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు ఉండగా, ఇదివరకు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొంత కాలంగా తప్పించుకుని తిరుగుతున్న మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన షేక్ ఖుర్బాన్‌ను మంగళవారం రైల్వేస్టేషన్‌లో పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో సంతోష్ అక్రమంగా రోడ్డుపై నిర్మాణం చేపట్టాడని కాలనీవాసులు ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సిబ్బంది కాలనీకి వచ్చి నిర్మాణ పనులు పరిశీలించారు. కోపోద్రిక్తుడైన సంతోష్ కాలనీవాసులు ఆవుల శివన్న, సత్యనారాయణ, ప్రసాద్, నవనీత్, కృష్ణవిహార్, నరేందర్‌లపై దుర్భాషలాడడంతోపాటు దాడికి యత్నించినట్లు వారు తెలిపారు. మంగళవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి ఏడురోజుల జైలు

జైపూర్: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ చెన్నూర్ కోర్టు జడ్జి రవి మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం..జైపూర్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించగా మంచిర్యాల వైపు నుంచి చెన్నూర్ వైపు వెళ్తున్న లారీని ఆపారు. డ్రైవర్ ఆర్కే గజానంద్‌కు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేయగా మద్యం తాగినట్లు రుజువైంది. చెన్నూర్ కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువు కావడంతో ఈ మేరకు జడ్జి తీర్పు వెలువరించారు.

భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ కైలాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జుమ్మెరాత్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య 89వ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని భగత్‌సింగ్ జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాష్ మాట్లాడుతూ దేశస్వాతంత్ర్యం కోసం 89 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి ఉద్యమంలో అనేక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నరేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న రాజిరెడ్డి

చెన్నూర్‌రూరల్: మండలంలోని గంగారం గ్రామంలో తాటికొండ చంద్రయ్య ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రయ్య తన భార్యతో కలిసి సోమవారం రాత్రి చెన్నూర్‌లోని తన కూతురు ఇంటికి వెళ్లాడు. ఇంట్లో దేవుని చిత్రపటం వద్ద దీపం వెలిగించి పోయారు. అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అప్పటికే బీరువాలో రూ.3.50లక్షలతోపాటు తులం బంగారం, 7 క్వింటాళ్ల బియ్యం, వెండిపట్ట గొలుసులు, సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.8లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. సంఘటనా స్థలాన్ని ఆర్‌ఐ రంజిత్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి మంగళవారం పరిశీలించారు.

రోడ్డు ప్రమాదం కేసులో వ్యక్తికి ఏడాది జైలు

నస్పూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కా రణమైన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మంచిర్యాల ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ జడ్జి ఫస్ట్ క్లాస్ డి.ఉపనిషద్వని మంగళవారం తీర్పు వె లువరించారు. జులై 7, 2017లో కట్కూరి లింగయ్య.. పట్టణ పరిధిలోని నస్పూర్ గేట్ వద్ద 63వ జాతీయ రహదారి దాటుతున్నాడు. ఆనందం ప్రైవేటు బస్సును అతివేగంగా వచ్చి లింగయ్యను ఢీకొని గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ లింగయ్య మృతిచెందాడు. అప్పటి సీసీసీ నస్పూర్ ఎస్సై దత్తాత్రి కేసు నమోదు చేశారు. పీపీ సహిన్ సుల్తానా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ఈమేరకు జడ్జి తీర్పునిచ్చారు.

ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్‌చౌక్ నుంచి శివాజీచౌక్ వెళ్లేదారిలో కొందరు తోపుడు బండ్లను పెట్టి వ్యాపారం చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని పలువురు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ అక్కడికి చేరుకొని తొలగించాలని సూచించారు. ఓ పార్టీకి చెందిన నాయకులు అక్కడికి చేరుకొని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. అదేవిధంగా అంబేద్కర్‌చౌక్ నుంచి గాంధీ చౌక్ వరకు మధ్యలో ఉన్న డివైడర్ పక్కనే తోపుడు బండ్లు ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. వాటిని అక్కడి నుంచి తొలగించి వేరే చోట పెట్టించాలని పలువురు పేర్కొంటున్నారు.